

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదురుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

### పిన్ని

పాల సముద్రంలా అందంగా ఉంటుంది అగ్రహారంలో గోదావరి. మెల్లగా కదిలే మందాకిని, సాయంత్రం పూట గోదావరొడ్డున నిలబడి చూస్తే కౌశిక వెనక పిల్లగాలికి చల్లగా తాళం వేసే పచ్చని తివాచీ పరిచినట్టున్న వరిచేలూ, వాటి వెనక మెల్లగా లోకాన్ని సెలవడుగుతున్న నీరెండ కిరణాల మధ్య మెరిసిపోతున్న సాయంకాలపు భానుడు కళ్ళ విందుగా ఉంటాడు. కౌశికగా పిలవబడే గోదావరి ఒడ్డునే రెండు రాములవారి గుళ్ళు. ముందు ఊరికి ఉన్నది చిన్నగుడి ఒక్కటే. తరవాత పెద్ద వరదలు వచ్చి చిన్న గుడి కూడ మునిగి పోయే పరిస్థితి రావడంతో అప్పటి కరణం గారి భార్య సూరేకాంతమ్మ గారు తూర్పు తిరిగి దండం పెట్టి 'రామచంద్రప్రభో! మమ్మల్ని చల్లగా చూడు, నీకు పెద్ద గుడి కట్టిస్తాను' అని మొక్కుకోవడంతో ముందు వానా, వరదా, ఆ తరవాత పెద్ద రాములవారి గుడీ వెలిసాయి.

మహదేవ శాస్త్రి గారు చిన్న రాములవారి గుడిలో పూజారి. రాములవారు చిన్నవాడు కాకపోయినా గుడి చిన్నదే, ఆదాయమూ చిన్నదే. చలువరాతి చపటాలు, గుడికి వెళ్ళేముందు కాళ్ళు కడుక్కోడానికి అమర్చిన ఇత్తడి కుళాయిలూ, ఇలాంటి హంగులున్న పెద్ద గుడి ముందు చిన్నగుడి వెలవెలపోవడంలో ఆశ్చర్యం లేదు. నారచీరలతో వనవాసానికి వెళ్ళే సీతరాముల్లాగే ఉంటాయి చిన్నగుడిలో విగ్రహాలు, కళ్యాణరాముడిలా తళుకులీనుతూ ఉంటాయి పెద్దగుడిలో.

శాస్త్రి గారికి ఒక్కర్తే కూతురు సుబ్బలక్ష్మి. తల్లిలేని సుబ్బుల్ని శాస్త్రిగారు ఉన్నంతలో గారాబంగా పెంచారు. చక్కని కనుముక్కు తీరుతో, తాచుపాములాంటి బారెడంత జడతో లక్ష్మీదేవి లాగే ఉంటుంది. పాలసముద్రంలాంటి గోదావరి ఒడ్డునే గుడి దగ్గరే శాస్త్రిగారి నివాసం కదా, అందుకేనేమో.. చిన్నరాములవారినే నమ్ముకున్న శాస్త్రిగార్కి మామూలు రోజువారీ జీవితం గడపడమే కష్టంగా ఉంది. 'ఒక

అర ఎకరం దేవుడి పొలం మీకే ఇస్తాను' అని ధర్మకర్త గారు అనడమే కానీ, ఇప్పటి వరకు చేసింది లేదు, ఏనాడూ తన దేవుడినే ఏమీ అడగని ఆయన ధర్మకర్త ని అడిగిందీ లేదు. తన గురించి దిగుల్లేదు ఆయనకి, సుబ్బుల్ని ఓ ఇంటిదాన్ని చేస్తే చాలు అన్నదే ఆయన కోరిక. తొమ్మిదో క్లాస్ తరవాత ఇంక చదివించలేక పోవడంతో సుబ్బులు చదువు ఆగిపోయింది. పొలమైనా చేతికి వస్తే అమ్మి పిల్ల పెళ్ళి చేయవచ్చని ఆయన ఆలోచన. సుబ్బులు ఎంతో ఒద్దికైన పిల్ల,. ఇంటి పనీ, వంట పనీ చక్కగా చేసుకుంటుంది. కమ్మగా పాడుతుంది. చుట్టుపక్కల చిన్నపిల్లలని చేరదీసి వాళ్ళకి పాఠాలు చెప్తుంది. మూడిళ్ళ అవతల ఉండే సీతాలక్ష్మిగారు నేర్పిస్తే జాకెట్, పరికిణీలు కత్తిరింపు నేర్చుకుని అప్పుడప్పుడూ వెళ్ళి ఆవిడని అడిగి తన బట్టలు తనే కుట్టుకుని వస్తుంది. పదిహేను వెళ్ళి పదహారు రావడంతో శాస్త్రిగారికి కంగారుగా ఉంది. తెలిసిన సంబంధాలు ఉంటే చూడమని పేరయ్యగారికి చెప్పారు.

ఓరోజు ఆయన ఇంటికి వచ్చాడు మంచి సంబంధం తెచ్చానంటూ.

'శాస్త్రి గారూ! ఒళ్ళో పిల్లాడిని పెట్టుకుని ఊరంతా వెతకడమంటే ఇదే కదూ! పొడుం బిగిస్తూ అన్నాడాయన.

'అంటే!? ' అర్థం కాక అడిగారు శాస్త్రిగారు.

'సుబ్బులుకి దివ్యమైన సంబంధం ఊర్లోనే ఉంది కదా మరి!' అన్నారు

'ఎవరండీ? వరుడూ? ' శాస్త్రిగారు అడిగారు.

'మీ దేవుడి పేరే, చిన్నరాముడు!'

ఆ పేరు విన్న శాస్త్రి గారి ముఖం ముడుచుకు పోయింది.

'చిన్నరాముడా? చూస్తూ చూస్తూ రెండో పెళ్ళివాడికి ఎలాగండీ? ఇవ్వడం' అన్నారు.

'అదేం మాట శాస్త్రిగారు? పిల్లలంటే ఉన్నారు కానీ, చిన్నరాముడికి పెద్ద వయసేమీ కాదు. ముగ్గురు ఆడపిల్లలూ ఓ మూడు నాలుగేళ్ళలో వెళ్ళిపోతారు, ఇంక మిగిలింది ఒక్క పిల్లాడు. రాముడికి ఉద్యోగం లేకపోతేనేం? లంకంత కొంపా, వెనకాల కొద్దిగా కొబ్బరితోట. తిండికీ, బట్టకీ లోటుండదు కదా పిల్లకి! ' అన్నారు.

కేవలం మూడు పూట్ల భోజనం, కట్టుకోవటానికి ఓ నాలుగు జతల బట్టలుండడమేనా పెళ్ళంటే? అని అడగాలని శాస్త్రి గారికి తోచలేదు. తనకా వయసయిపోయింది. 'ఏదైనా జరగరానిది జరిగితే పిల్ల గతేమిటి? ఎంత చక్కదనముంటే మాత్రం ఈ పేదతండ్రి ఇంతకంటే ఏమి చేయగలడు? ' అన్న ఊహే అతని మనసులో సుడిగుండంలా కదలాడింది.. అదే బహుశా ఆయనతో దీనికి సరేననిపించింది.

అలా తన పదహారో ఏట పిల్లలకి పిన్నిగా, చినరాముడి భార్యగా, అతని ఇంట్లో కాలు పెట్టింది సుబ్బులు.

'ఏం చూసి ఈ సంబంధం తెచ్చావు నాన్నా? అని మాత్రం అడగకు తల్లీ! ఈ అశక్తుడిని మన్నించు' అని తండ్రి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే అనునయంగా అంది 'ఊరుకోండి నాన్నా! నేను పెళ్ళి చేసుకుని ఇంకో ఊరు వెళ్ళిపోతే మిమ్మల్ని చూసుకోవడానికి ఎవరుంటారు? అందుకే రాముడు ఇలా ఏర్పాటు చేసాడు'. అని నవ్వింది.

**తల్లి లేని ఆడపిల్లలు తండ్రికే తల్లులవుతారేమో!**

తన కన్నా నాలుగేళ్ళ చిన్న వయసుతో మొదలుపెట్టి నలుగురు పిల్లలు. చుట్టుపక్కల వాళ్ళు చెప్పిన అక్కర్లేని కబుర్ల ప్రభావం పెద్ద పిల్లలిద్దర్లో కనపడినా, చిన్నవాళ్ళిద్దరూ తొందరగానే కలిసారు ఆమెతో. ఎప్పుడైనా వెళితే ఎవరింటికైనా పౌరోహిత్యానికి వెళ్ళడం, లేకపోతే హాయిగా తిని పడుక్కోవడం మాత్రం తెలుసు చినరాముడికి. ఈపూట భోజనం అయ్యింది సరే, రాత్రికి ఎలాగ? అన్న ఆలోచనే లేదు. బాధ్యతా లేదు.

ఆడదిక్కు లేని సంసారం చుక్కాని లేని నావలాగే ఉంది. వంట భారం పూర్తిగా తప్పించినందుకు పెద్ద పిల్లలిద్దరూ కూడ కొద్దిగా మారారు. పట్టుబట్టి అందరినీ స్కూల్‌లో వేసింది. వాళ్ళతో పాటే చదివేది, ఆడేది, పాడేది. అట్లతద్ది వస్తే అందరికీ చేతిలో బంతి ఆకు వేసి గోరింటాకు పెట్టేది. ఇంటి వెనక తులసికోట దగ్గర పెద్ద పెద్ద గళ్ళూ గీసి పిల్లలతో తొక్కుడు బిళ్ళ ఆడేది. ముందున్న పందిరి మీద సన్నజాజీ విరజాజీ కలిసి పూసిన పువ్వులన్నె మాల గుచ్చి పిల్లలకి పెట్టి తనూ పెట్టుకునేది. స్కూల్ పని మాత్రం కచ్చితంగా చేసేలా చూసేది. కరంటు లేని ఆ ఇంట్లో లాంతరు వెలుగులో చదివించేది. వాళ్ళకు రాకపొతే తనే బొమ్మలు గీసిచ్చేది. పిన్నీ అని పిలిచినా అక్కా అని పిలిచినట్టే అనుకునేది. ఆడపిల్లలు సంక్రాంతికి గొబ్బిళ్ళు పెట్టుకుని 'మొగలీ పువ్వంటీ మొగుడ్నీయావే! ' అని ముసి ముసి నవ్వులతో పాడుతుంటే కళ్ళల్లో సన్నని నీటి తెర ఉన్నా పైకి తనూ నవ్వేసేది.

నాలుగేళ్ళకాలం గడవడానికి ఆట్టే సేపు పట్టలేదు. 'ఇదేం పిల్లమ్మా? సవితి పిల్లల్ని ఇంత ప్రేమగా చూసుకుంటారా? చూద్దాం! ఇదెన్నాళ్ళో! దానికీ ఒకడు పుడితే తెలుస్తుంది 'అని అమ్మలక్కలు నోరు పారేసుకున్నా పట్టించుకోలేదు. తనకి ఒక కొడుకు పుట్టినా సరే వాడినీ వాళ్ళతో సమానంగానే చూసింది.

పక్కింటి పిన్నిగారు సమయం చూసి రెండు మూడు సార్లు 'చూడు సుబ్బులూ! లోకంలో ఎక్కడైనా తన్ను మాలిన ధర్మం వుండదు కదా? పిల్లల గోలలో పడి నీ సంగతి నువ్వు మర్చిపోకూడదు. వాళ్ళ అమ్మ నగలుండాలేమో ఏవో! అవి తీసి జాగ్రత్త చేసుకో. పిల్లల్ని కొద్దిగా అదుపులో ఉంచు', అని ఇలా ఎవో చెప్పబోతే

'పిన్నిగారూ! చిన్నప్పటినించీ తల్లి లేకుండా పెరిగాను, తల్లి విలువ ఏమిటో నాకు తెలుసు. వాళ్ళకు తల్లినయేంత వయసూ, అనుభవమూ లేకపోయినా నా చేతనయినంతలో మీలాంటి పెద్దవారి సలహాలతో వాళ్ళకి వీలైనంత మంచి చేయాలని నా తాపత్రయం మీరే ఇలా అంటే ఎలా చెప్పండి?' అని ఆవిడ నోటికి తాళం వేసేది.

రాను రాను చినరాముడి బద్ధకం మరీ పెరిగిపోయింది. ఆదాయం లేకపోయినా ఆరున్నొక్కరి భోజనానికి అన్నం కావాలి కదా. అందుకే ఊర్లో వాళ్ళకి జాకట్లు కుట్టడం మొదలు పెట్టింది. పక్కగా ఉన్న రెండు గదులూ, వసారా అద్దెకి ఇచ్చింది. కొబ్బరి కాయలు అమ్మిన డబ్బులూ, అద్దె డబ్బులూ, రాముడు సంపాదించే దానితో సంసారం గడిపేది. తను సంపాదించేది మాత్రం వేరే దాచి ఉంచేది. పిల్లల అవసరాలకి, ఆడపిల్లల అవసరాలు చెప్పి రావు కదా! పిల్లలతో కలిసి పెరట్లో కూరల మొక్కలు పెంచేది. డబ్బుకి వెతుక్కునే రోజుల్లో పెరట్లో పండిన కందతో కందట్లో, పెసరట్లో వేసి అన్నంతో పాటు పెట్టేది.

తనకి ఈ సంబంధం తెచ్చిన పేరయ్యగారు మళ్ళీ వచ్చి పెద్దపిల్ల భవానికి చక్కటి వాడు అంటూ ఒక రొండో పెళ్ళివాడిని ని తీసుకువస్తే 'మా పిల్లలకి చచ్చినా రెండో పెళ్ళి సంబంధాలు చెయ్యము' అని చెప్పేసింది. పైగా పద్దెనిమిదేళ్ళు నిండకుండా పెళ్ళి చేస్తే మిమ్మల్నీ, పేరయ్యగారినీ కూడ జెయిలులో పెడతారు' అంటూ, 'శారదా చట్టం గురించి మీకైనా తెలియదుటండీ?' అని శాస్త్రిగారిని నిలేసింది.

'ఏం పెట్టి చేస్తావు అందరికీ పెళ్ళిళ్ళు? ఇలా గుమ్మంలోకి వచ్చిన సంబంధాలని కాదంటే? ' అని చిన రాముడు దెబ్బలాటకి దిగాడు.

'ఏది లేకపొతే హాయిగా మనతోటే ఉంటారు అంతే కాని ఇది మాత్రం కుదరదు, అయినా వాళ్ళకంటే మనకి ఏదీ ఎక్కువ కాదు, వాళ్ళ చదువుకులకీ, పెళ్ళిళ్ళకీ అవసరం అయితే తోటా, ఇల్లూ కూడ అమ్మేద్దాం, అంతేకాని పిల్లలకి మంచిది కానిదేదీ చెయ్యడానికి వీలు లేదు. ' అని తిరిగి వాదించింది.

పెద్ద పిల్లకి పద్దెనిమిదేళ్ళు నిండాకా, తన దూరపు బంధువూ, అక్కవరస అయ్యే సులోచన కొడుకు, అమలాపురంలో స్కూల్ లో డ్రాయింగ్ మాస్టారుగా పనిచేస్తున్న శంకరానికి కుదిర్చి పెళ్ళి చేసింది. చిన్నపిల్లకి బొమ్మలు వెయ్యడంలో శ్రద్ద చూసి అల్లుడితో చెప్పి

డిప్లమా చేయించింది. అది అవ్వగానే ఆ పిల్ల ఒక ప్రయివేట్ స్కూల్‌లో టీచర్ గా చేరింది. ఉద్యోగం చేస్తున్న పిల్లకి పెళ్ళి కావడానికి పెద్ద కష్టం కాలేదు.

మూడోది శారద, నిజంగానే చదువుల శారద. అల్లుళ్ళ సలహాతో ఆర్ధికంగా వెనకబడ్డ వాళ్ళకిచ్చే స్కాలర్షిప్ సంపాదించి డిగ్రీ చదివించింది, అదయ్యాక పిల్ల పోటీ పరీక్ష రాసి ఎల్.ఐ.సీ లో క్లర్క్‌గా ఉద్యోగం తెచ్చుకుంది. పిల్లవాడిని మాత్రం ఇంజనీర్ చెయ్యాలని సుబ్బులి సంకల్పం.

‘నీకేమైనా వెర్రేవిటే? ఇంజనీరు చదువంటే మాటలా? ‘ అంటున్న చిన్నరాముడిని

‘మీరేం మాట్లాడకండి! ఇవన్నీ ఎలా జరిగాయో ఇదీ అలాగే అవుతుంది‘ అని అతని నోరు మూయించింది.

పిల్లల అమ్మ నగల్లో ఆఖరుగా మిగిలిన గాజుల జత అమ్మేసి మరీ పిల్లాడికి ఫీజు కట్టింది.

వాడు కాలేజి ఫస్టున పాసయ్యి స్టేటు గవర్నమెంటు లో జూనియర్ ఇంజనీర్ గా చేరిన నాడు ఆనందంతో ఎగిరి గంతేసింది. ‘పిల్లలకి ఇన్ని చేసావు? నీ కొడుక్కో? ‘ పక్కింటి పిన్నిగారు అడిగితే ఒక్కటే మాట చెప్పింది.. ‘నా కొడుకేమీ అనాధ కాదు, ముగ్గురు అక్కలూ, ఒక అన్నయ్యా ఉన్నారు వాడికి‘ అని.

మూడో పిల్ల శారద పెళ్ళిలో, సుబ్బలక్ష్మి పుట్టినరోజుకి భవాని పట్టుచీరతోనూ, మిగత ఇద్దరు ఆడపిల్లలూ ఒక గాజుల జతతోనూ, పెద్ద పిల్లాడు మాధవ మెడలోకి బంగారం గొలుసు తోనూ వచ్చి ,

‘అమ్మా తమ్ముడిని నాతో తీసుకుపోతాను, కాకినాడ లో మంచి స్కూల్ లో చేరుద్దాం! వాడు నాకంటే బాగా చదువుకోవాలి అని మాధవ అన్నప్పుడు, మా అమ్మ అయినా సరే మాకింత చేసేదే కాదు. ఏం పుణ్యం చేసామని మాకు దేవుడు ఈ అమ్మ కాని అమ్మని ఇచ్చాడో‘ అని వాళ్ళు నలుగురూ కౌగలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటే

‘అప్పుడు నిజంగానే పెద్దవాళ్ళూ ప్రయోజకులూ అయిన పిల్లల్ని చూసి ఆనందంతో ఏడిచింది వాళ్ళ పిన్ని సుబ్బలక్ష్మి.

